ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కోటి దీపోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- స్వాగతం పలికిన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాష్ట్రపతికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి సీతక్క పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్రపతి అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి అనంతరం రాత్రి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకొని బసచేశారు. శుక్రవారం ఉదయం శిల్పారామంలో నిర్వహించనున్న 'లోక్ మంథన్-24'లో రాష్ట్రపతి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12:05 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఢిల్లీకి తిరుగు పయనమవుతారు.

మంత్రి సురేఖపై పరువు నష్టం కేసులో 28న తీర్పు

- నాగార్జున దావాపై ముగిసిన వాదనలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. ఈ కేసులో తీర్పు ఈ నెల 28న వెలువడనుంది. ప్రజాప్రతినిధుల కోర్టులో గురువారం జరిగిన విచారణ సందర్భంగా నాగార్జున తరపున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలు పత్రికలు, టీవీ చానళ్లు సహా సామాజిక మాధ్యమాల్లో వచ్చాయని, దీంతో నాగార్జున కుటుంబం పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నాయని చెప్పారు. మంత్రి సురేఖ తరపున సీనియర్ న్యాయవాది మస్తాన్‌నాయుడు వాదనలు వినిపించారు. వాదనలు ముగిసిన అనంతరం మేజిస్ట్రేట్ శ్రీదేవి తీర్పును రిజర్వు చేస్తూ కేసు వాయిదా వేశారు.

100 కోట్ల పరువు నష్టం కేసులో....

కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో కోర్టు ఇప్పటికే సురేఖకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు వాయిదా వేసింది. సోషల్ మీడియా, టీవీల్లో, పత్రికల్లో ప్రసారమైన వార్తలను తొలగించాలని, మరోసారి వార్తను ప్రసారం చేయకూడదని కోర్టు ఆదేశించింది. కేసు నమోదు సమయంలో కోర్టుకు రూ. కోటి ఫీజును కేటీఆర్ చెల్లించారు.

ఒకే నేరంపై పలు ఎఫ్ఐఆర్ల నమోదు చెల్లదు

- హైకోర్టులో పట్నం భార్య పిటిషన్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఒకే నేరానికి సంబంధించి పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్‌రెడ్డి తరపున ఆయన భార్య అఫిడవిట్ దాఖలు చేశారు. బొమ్రాస్‌పేట పోలీసుస్టేషన్‌లో ఒకే ఘటనపై మూడు కేసులు నమోదు చేశారని తెలిపారు. రాజకీయ కక్షలతోనే ఈ కేసులు నమోదు చేశారని, ఒకదాని తర్వాత మరొకటిగా కేసులు పెట్టి పిటిషనర్‌ను జైలు నుంచి రాకుండా చేయాలన్న కుట్ర జరుగుతున్నదన్నారు. ఒకే నేరానికి సంబంధించి పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయరాదంటూ కోర్టులు తీర్పులు వెలువరించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేయనుంది.

కార్యకర్తలకు పోస్టుల ఎర

- ప్రజాపాలన విజయోత్సవాలపై కాంగ్రెస్ క్యాడర్‌లో విముఖత
- నామినేటెడ్ పదవులు ఇవ్వబోతున్నట్టు లీకులు
- కార్యకర్తలతో ఆటలు వద్దన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్21(నమస్తే తెలంగాణ): ప్రజాపాలన విజయోత్సవ సభలు అట్టహాసంగా నిర్వహించేందుకు పార్టీ స్థానిక నాయకత్వం, కార్యకర్తలు విముఖత చూపుతున్న నేపథ్యంలో వారిలో ఉత్సాహం నింపేందుకు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలను సోషల్ మీడియా లీకుల ద్వారా ప్రచారంలోకి తీసుకుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మహిళా మంత్రులు, 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన వరంగల్ విజయోత్సవ సభకు ఆశించిన మేరకు మహిళలు రాలేదని, ప్రభుత్వ కార్యక్రమం పూర్తిగా అధికారుల మీదనే వదిలేశారని రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 10.5 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉండగా వరంగల్ సభకు లక్ష మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. గ్రామాలకు 900 బస్సులు, ప్రతి బస్సుకు మహిళా కానిస్టేబుల్‌ను పెట్టినప్పటికి 40 వేలకు మించి హాజరు కాలేదని చర్చకు వచ్చినట్టు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో విజయోత్సవ పాలన వాతావరణమే కనిపించడంలేదని, జెండాలు, తోరణాలు ఏర్పాటు చేయడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

గ్యారెంటీలు అమలు కాకపోవడంపై నిర్లిప్తత

ఆరు గ్యారెంటీలు అమలు కాకపోవడం, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 హామీ నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఎమ్మెల్యేలకు నిధులు లేకపోవడం, నామినేటెడ్ పోస్టులు భర్తీ కాకపోవడం, పీసీసీ కార్యవర్గ కూర్పు లేకపోవడంతో క్యాడర్‌లో నిర్లిప్తత నెలకొందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశంలో ప్రస్తావించినట్టు తెలిసింది. రుణమాఫీ చేశామని చెప్పుకోవడంలో విఫలమయ్యామని భట్టి అన్నట్టు తెలిసింది. కార్యకర్తల్లో ఉత్సాహం లేకపోతే నవ్వినోని ముందు జారిపడ్డట్టు అవుతుందని అనుకున్నట్టు తెలిసింది. ప్రభుత్వానికి అనుసంధానంగా పార్టీని నడపడంలో పీసీసీ విఫలం అవుతున్నట్టు చర్చకు వచ్చినట్టు సమాచారం. పార్టీ నాయకత్వం, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు వెంటనే మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని పీసీసీ అధ్యక్షుడికి సూచించినట్టు తెలిసింది. మార్కెట్ కమిటీ చైర్మన్లు, పాలకమండలి సభ్యులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ల నియామకం కొలిక్కి రాబోతున్నదని, మిగతా నామినేటెడ్ పదవులను త్వరితగతిన భర్తీ చేయడానికి కసరత్తు జరుగుతున్నదని, ముఖ్యనేతలు ఈ నెల చివర ఢిల్లీ వెళ్లి అధినాయకత్వాన్ని కలవాలని నిర్ణయించినట్టు సోషల్ మీడియాలో లీకులు వదలాలని, ప్రధాన మీడియాకు ఇదే సమాచారం లీకులుగా పంపాలని సూచించినట్టు తెలిసింది.

ఆశ చూపిస్తేనే ఉత్సాహంగా పని

రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే వేగంగా జరుగుతున్నదని, ఈ సమాచారాన్ని క్రోడీకరించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుబోతున్నామనే విషయం క్యాడర్‌కు చెప్పాలని సూచించినట్టు తెలిసింది. వారికి ఆశ చూపిస్తేనే ఉత్సాహంగా పనిచేస్తారనునుకున్నట్టు సమాచారం. ఈ నిర్ణయాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యతిరేకించినట్టు తెలిసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ మీద ఇప్పటి వరకు జాతీయ నాయకులు రాహుల్, ప్రియాంకాగాంధీ నుంచి ఆదేశాలు లేవని, వారి దృష్టిలోలేని అంశాలను కార్యకర్తలకు ఎలా చెప్పగలమని వాదించినట్టు సమాచారం. జెండాలు మోసిన కార్యకర్తలకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని మోసం చేయడం మంచిదికాదని, క్యాడర్‌తో ఆటలు వద్దని సీరియస్‌గానే చెప్పినట్టు తెలిసింది.

మాలలను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

- కొంత మంది మాలలు వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు
- పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సంపత్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మద్దతు ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది మాలలు.. వర్గీకరణకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. ఇలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినట్టుగా తెలిసింది. గురువారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు పార్టీ నాయకత్వం అంగీకరించిన నేపథ్యంలో అందరూ సహకరించాలని కోరారు. కానీ కొంత మంది మాలలు పార్టీలో ఉంటూ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా పార్టీ వర్గాలు తెలిపాయి. అలాంటి వారిని గుర్తించి వెంటనే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో పార్టీకి నష్టం జరుగుతుందని ఆయన అన్నట్టుగా తెలిసింది.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపండి

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు అభిప్రాయాలను తెలపాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ సూచించారు. ఈ మేరకు వారికి లేఖలు రాశారు. ఇప్పటికే ఎస్సీ సంఘాలు, వ్యక్తుల నుంచి ఉపకులాల వర్గీకరణకు సంబంధించిన వినతులు, అభిప్రాయాలు, అభ్యర్థనలను కమిషన్ స్వీకరిస్తున్నది. తాజాగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ల నుంచి కూడా అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా లేఖలు రాసినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి.

నల్లగొండ డీఈవోపై భార్య ఫిర్యాదు

- విడాకులు తీసుకోకుండానే రెండో పెండ్లి చేసుకున్నట్టు ఆరోపణ

రామగిరి, నవంబర్ 21: తనను వివాహం చేసుకొని మరో మహిళతో కాపురం ఎలా చేస్తారని నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతిని భార్య మాధవి నిలదీసింది. మరో మహిళతో ఉంటున్న భిక్షపతి ఇంటికి వెళ్లిన ఆమె అతనిపై ఆగ్రహం వ్యక్తంచేసింది. 25 మే 2010న తనకు భిక్షపతితో వివాహం జరిగిందని మాధవి తెలిపింది. పెండ్లి తరువాత భర్తతోపాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయగా, 4 ఏప్రిల్ 2011న గోదావరిఖని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొన్నారు. విడాకులు తీసుకోకుండా మరో పెండ్లి ఎలా చేసుకున్నారని భర్తను నిలదీస్తే తాను ఇలాగే ఉంటానంటూ బెదిరిస్తున్నట్టు తెలిపారు. కాగా డీఈవో ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మాధవిని నల్లగొండ టు టౌన్ పోలీసులు వచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లగా ఆమె భర్తపై ఫిర్యాదు చేసింది.

ఏపీ, కర్ణాటక కుమ్మక్కు..!

- తుంగభద్ర జలాలు మళ్లించే కుట్రలు?
- నావలి విస్తరణకు కర్ణాటక కసరత్తులు
- వరద జలాల పేరుతో ఏపీ ప్రణాళికలు
- పొరుగు కుట్రలపై సర్కారు మౌనం
- నేడు తుంగభద్ర బోర్డు సమావేశం

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడుతూ నదీజలాల్లో అన్యాయం జరగకుండా చూసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రయోజనాలను పొరుగు రాష్ట్రాలు కాలరాస్తున్నా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. తుంగభద్ర జలాల మళ్లింపు కోసం ఏపీ, కర్ణాటక కుట్రలు చేస్తుంటే సీఎం రేవంత్ ఖండించలేదంటే ఆయన ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కుడి, ఎడమల దగా

నీటి నిల్వ సామర్థ్యం పడిపోయిందంటూ కర్ణాటక సర్కారు నావలి రిజర్వాయర్ విస్తరణకు ప్రణాళికలు రచించింది. వరదజలాలే తరలిస్తామని చెబుతూ ఏపీ సర్కారు హెచ్ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువ తవ్వేందుకు ప్రణాళికలను రూపొందించింది. తుంగభద్ర డ్యామ్ హైలెవల్ కెనాల్ అనంతపురం జిల్లా మీదుగా పోతున్నది. హెచ్ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు ప్రణాళికలను రూపొందించింది.

తెలంగాణకు తీరని నష్టం

ఏటా 500 టీఎంసీల జలాలు కృష్ణాలోకి వస్తాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏపీ, కర్ణాటక ప్రాజెక్టులు నిర్మిస్తే కృష్ణాలోకి వచ్చే జలాలు తగ్గిపోతాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు జలాలు రావడమే గగనమైపోతుందని, మనకు నష్టం కలుగుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

కాంగ్రెస్ సర్కారు మౌనం

కర్ణాటక ప్రతిపాదిస్తున్న కాలువలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించింది. తుంగభద్ర బోర్డు మీటింగ్‌లోనూ అభ్యంతరం తెలిపింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నోరు మెదపడంలేదు. నేడు హోస్పేట్‌లో తుంగభద్ర బోర్డు 220వ సమావేశం జరగనుంది. ఇవాళ్టి సమావేశంలోనైనా రేవంత్ సర్కారు కర్ణాటక, ఏపీ ప్రాజెక్టులపై వ్యతిరేకత తెలపాలని తెలంగాణ ఇంజినీర్లు డిమాండ్ చేస్తున్నారు.

టీచర్లకు ఓటుహక్కు ఎందుకివ్వరు?

- వివరణ ఇవ్వాలని ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించకుండా ఎందుకు నిరాకరిస్తున్నారో వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్నికల సంఘానికి హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎస్‌జీటీ కృష్ణమూర్తి దాఖలు చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ పీఎస్, యూపీఎస్ టీచర్లకు ఓటు హక్కు లేకుండా ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని చెప్పారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమానంగా వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం వివక్ష చూపడమేనని అన్నారు.

9 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

- నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ఆమోదిస్తాం
- 7 నాటికి మంత్రివర్గ విస్తరణకు అవకాశాలు
- కులగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి!

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నిర్వహిస్తామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పినట్టు సమాచారం. గురువారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పొంగులేటి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ఆమోదింపజేస్తామని చెప్పారు. విద్యుత్తు కొనుగోళ్లపై కమిషన్ నివేదిక, ఇతర అంశాలపైనా చర్చిస్తామని చెప్పారు. డిసెంబర్ 7 నాటికి తమ ప్రభుత్వానికి ఏడాది పూర్తవుతుందని, ఆలోగా మంత్రివర్గ విస్తరణ పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వంలో రెండోస్థానం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కదే నని పొంగులేటి స్పష్టంచేశారు. కొండపోచమ్మ సాగర్ సమీపంలో మాజీ మంత్రి హరీశ్‌రావు భూముల కొనుగోళ్లపై విచారణ జరుపుతున్నామని, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు విషయంలో గవర్నర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తయి, నివేదిక వచ్చాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని పొంగులేటి చెప్పినట్టు తెలిసింది.

సమావేశాల అనంతరం అమెరికాకు?

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్తారని సమాచారం. డిసెంబర్ 9న సమావేశాలు ప్రారంభిస్తామని మంత్రి చెప్తున్నా.. ఇంకా తేదీ ఖరారు కాలేదని సమాచారం. డిసెంబర్ చివరి వారంలో సమావేశాలు ప్రారంభించాలని, 10 రోజుల్లో పూర్తి చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఆర్వోఆర్ చట్టంతోపాటు, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలకు పెంచే అంశంపై, పింఛన్ల సొమ్ము పెంపుపైనా అసెంబ్లీలో ప్రకటన ఉండే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ఆ తర్వాత జనవరి మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్తారని చెప్తున్నారు. దాదాపు 10 రోజులపాటు పర్యటన ఉంటుందని సమాచారం. ఈ ఏడాది ఆగస్టులోనే సీఎం అమెరికాకు వెళ్లొచ్చిన సంగతి తెలిసిందే. ఐదు నెలల్లోనే మరోసారి వెళ్తుండటం గమనార్హం.

విగ్రహావిష్కరణ ఉన్నట్టా? లేనట్టా?

డిసెంబర్ 9కి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలకు, మంత్రి పొంగులేటి మాటలకు పొంతన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే పలుమార్లు ప్రకటించారు. అదేరోజు లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కానీ.. మంత్రి పొంగులేటి మాత్రం డిసెంబర్ 9న అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పడం అనుమానాలకు తావిస్తున్నది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారా? లేదా? అన్నది ప్రశ్నార్థంగా మారింది. అటు అసెంబ్లీ నిర్వహిస్తూనే ఇటు విగ్రహావిష్కరణ, సభ నిర్వహణ సాధ్యం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు సచివాలయంలో ప్రభుత్వం చేపట్టిన వాస్తు మార్పులు, విగ్రహ ఏర్పాటు పనులు గడువులోగా పూర్తవడం అనుమానమే అన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చర్చను పక్కదారి పట్టించేందుకు మంత్రి ద్వారా అసెంబ్లీ సమావేశాల పేరుతో లీకులు ఇచ్చినట్టు విమర్శలు ఉన్నాయి. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే విగ్రహం విషయాన్ని ప్రజలు మర్చిపోతారని భావిస్తున్నట్టు తెలిసింది.

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వలస నేతలకు పదవులా?

- బీర్కూర్‌లో రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు

నస్రుల్లాబాద్, నవంబర్ 21: దశాబ్దాలుగా జెండా మోసిన వారిని కాదని వలస వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడంపై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. పార్టీ తీరును నిరసిస్తూ కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో గురువారం రోడ్డుపై బైఠాయించారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలో సీనియర్ కార్యకర్తలు ఉన్నా.. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన దుర్గం శ్యామలకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కట్టబెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారిని కాదని ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన పోచారం అనుచరులకు పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ను తొలగించి.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ ప్రతిపాదించిన పార్టీ కార్యకర్తకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



గాంధీభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న జుక్కల్ నియోజకవర్గ నాయకులు

జుక్కల్ ఎమ్మెల్యేపై అధిష్ఠానానికి ఫిర్యాదు

- తమను పట్టించుకోవట్లేదని సొంత పార్టీ నాయకుల ఆగ్రహం
- గాంధీ భవన్ ఎదుట నిరసన

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నాయకులే తిరుగుబాటు జెండా ఎగరేస్తున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుపై నియోజకవర్గ సీనియర్ నాయకులు గురువారం అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. గాంధీభవన్‌కు వచ్చిన 8 మండలాల నేతలు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు.. 20 ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ వారిని కాదని ఎవరెవరికో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిర్యాదు అనంతరం గాంధీభవన్ మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సౌదాగర్ అరవింద్, కమల్, వినోద్, సంగమేశ్వర్, ప్రదీప్, అన్ని మండలాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెరు కాంగ్రెస్‌లో వర్గపోరు

- గాంధీభవన్ ఎదుట ఆందోళన
- భట్టి, పీసీసీ చీఫ్‌ను కలిసిన కాటా
- ఎమ్మెల్యే గూడెంపై ఫిర్యాదు

సంగారెడ్డి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ నేతల పంచాయితీ గాంధీభవన్‌కు చేరింది. కాంగ్రెస్‌లో ముఖ్యనేతల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరుకున్నది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలైన కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన నీలం మధు వర్గాలు నియోజకవర్గంలో పెత్తనం కోసం పోటీపడుతున్నారు. సంగారెడ్డిలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ హాజరైనా ముగ్గురు నాయకులు డుమ్మా కొట్టారు. కాటా అనుచరులతో కలిసి గాంధీభవన్ ఎదుట నిరసనకు దిగారు. పటాన్‌చెరులో పార్టీ కోసం పనిచేస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు న్యాయం చేయాలంటూ కార్యకర్తలు నినదించారు. కాటా ఉపముఖ్యమంత్రి భట్టి, పీసీసీ చీఫ్‌ను కలిసి పటాన్‌చెరులో పార్టీ పరిస్థితి వివరించి, ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.

సచివాలంలో 'ఫేషియల్' అటెండెన్స్

నేటి నుంచి అమల్లోకి.. ఉద్యోగుల అసంతృప్తి

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): సచివాలయ ఉద్యోగులకు నేటి నుంచి నూతన హాజరు వ్యవస్థ అమల్లోకి రానున్నది. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం అమలుచేస్తామని సీఎస్ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం కానున్నది. అయితే ఈ విధానంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉద్యోగులతోనో, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతోనో ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ హాజరు విధానంతో తమకు ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల అభ్యంతరాలు..

- సచివాలయ ఉద్యోగులు కొన్నిసార్లు కోర్టు పనిమీదనో, అసెంబ్లీ విధుల్లో భాగంగానో, మంత్రులు, ఉన్నతాధికారుల ఆదేశం మేరకో ఆలస్యమైతదని చెప్తున్నారు.
- అనేక సందర్భాల్లో రెండు, మూడు గంటలు అదనంగా ఆఫీస్‌లో ఉండాల్సి వస్తుందని, ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంలో అర్ధరాత్రి వరకూ ఉండాల్సి వస్తుందన్నారు. ఇలాంటి సందర్భాల్ల